

చేపను బట్టి వల

వేట విరామ సమయం కావడంతో వలలు, బోట్లకు మరమ్మతులు వంటి పనులతో మత్స్యకారులు బిజీగా ఉన్నారు.

- 10లో..



విద్యుత్ షాక్‌తో 22 గేదెలు మృతి

జిల్లాలోని మార్కాపురం, కంభం మండలాల్లో విద్యుదాఘాతానికి గురై గురువారం ఒక్కరోజే 22 గేదెలు మృతిచెందాయి.

- 10లో..

గరిష్టం/కనిష్టం
34 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు ఒంగోలులో మెగా జాబ్‌మేళా

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక మంగమూరు రోడ్డులోని నాగార్జున డిగ్రీ కళాశాలలో ఈ నెల 24వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ఐటీ, ఫార్మసీ, ప్రొడక్షన్, మాన్యుఫాక్చరింగ్, వివిధ కంపెనీలు, రాపిడో డిస్ట్రిబ్యూషన్, హెల్మెట్, షర్ట్‌లు, టీ షర్ట్‌లు, తదితర కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు.

ఏపీఈఏపీ సెట్‌కు 1886 మంది హాజరు

ఒంగోలు సిటీ: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి గురువారం నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ పరీక్షకు జిల్లాలో 1,886 మంది హాజరయ్యారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కాకినాడలోని జేఎన్‌టీయూ భాగస్వామ్యంతో ఏపీఈఏపీ సెట్–2025 నిర్వహిస్తోంది. జిల్లాలో రెండోరోజు మొత్తం 1959 మందికిగానూ, 1886 మంది (96.27 శాతం) హాజరయ్యారు.

యోగా పాఠ్యాంశం రాజ్యాంగ విరుద్ధం



మాట్లాడుతున్న హేతువాద సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: పాఠ్యాంశంగా యోగాను చేర్చడం రాజ్యాంగ విరుద్ధమని భారత హేతువాద సంఘ అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య అన్నారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు యోగాను పాఠ్యాంశంగా చేరుస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యోగా అనేది మతపరమైన ఆచారమని అన్నారు. క్రీస్తు పూర్వం 200 సంవత్సరాల క్రితం పతంజలి ఆత్మ పరమాత్మలో కలిసేందుకు యోగా మార్గమని ప్రతిపాదించాడన్నారు. యోగా చావుకి దగ్గరి మార్గమని, యోగా లక్ష్యం ముక్తిపొందడం అని అన్నారు. యోగా శాస్త్రీయం కాదన్నారు. యోగా వంటి మతపరమైన కార్యక్రమాలను లౌకికరాజ్యంలో ప్రతిఒక్కరూ పాటించాలని ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. విలేకరుల సమావేశంలో ఏపీ హేతువాద సంఘ అధ్యక్షుడు ఎంకే బేగ్, సీపీఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, శిఖా చంద్రశేఖర్‌బాబు, పౌరహక్కుల సంఘ నాయకులు గుమ్మళ్ల నరసింహారావు, సుభానీ, తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు లాయర్‌పేటలో పూజలందుకుంటున్న చిట్టి ఆంజనేయస్వామి



చీమకుర్తిలో ద్రాక్ష పండ్ల అలంకరణలో ఆంజనేయస్వామి



మార్కాపురం కంభం రోడ్డులో విశేష అలంకరణలో నాగులపుట్ట వీరాంజనేయస్వామి



కనిగిరిలో హనుమాన్ శోభాయాత్ర

పవన పుత్రా.. పాహిమాం

హనుమజ్జయంతి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. స్వామివారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కనిగిరి, మార్కాపురంలో శోభాయాత్రల్లో హనుమాన్ భక్తులు కదంతొక్కారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణలు నిర్వహించారు.

– సాక్షి, ఒంగోలు

అయ్యోర్ల బదిలీల్లో.. తప్పుల తడక

- ఆరంభం నుంచే వెంటాడుతున్న సాంకేతిక సమస్య
- రెండోరోజూ సర్వర్ డౌన్
- ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాల్లో తప్పులు
- 1:45 అంగీకారం కుదరకుండానే బదిలీలు
- సమస్యలు పరిష్కరించాకే ప్రక్రియ ప్రారంభించాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- తొందరపడి దరఖాస్తు చేసుకోవద్దంటున్న సంఘాలు

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రహసనంగా సాగుతోంది. రెండు రోజులుగా సర్వర్ మొరాయిస్తోంది. అలాగే ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలన్నీ తప్పులతడకలుగా ఉన్నాయి. సమస్యలు పరిష్కరించకుండా బదిలీలు ఎలా అంటూ ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. దీనికితోడు పాఠశాలల పునర్వ్యవస్థీకరణ సమస్యపై ఉపాధ్యాయులకు అభ్యంతరాలున్నాయి. దాన్ని పూర్తిగా పరిష్కరించకుండానే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు. మొత్తం మీద ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కు అన్నట్లు సాగుతోంది. జిల్లావ్యాప్తంగా సుమారు రెండువేల మంది వరకూ బదిలీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఒంగోలు సిటీ: టీచర్ల బదిలీల వ్యవహారమంతా గందరగోళంగా మారింది. బుధవారం నుంచి ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఆరంభం రోజే సాంకేతిక సమస్య తలెత్తింది. సర్వర్ పనిచేయకపోవడంతో దరఖాస్తుదారులు అవస్థలు పడ్డారు. రెండోరోజు కూడా అదే పరిస్థితి. వెబ్‌సైట్ మొరాయిస్తోంది. జిల్లాలో విద్యాశాఖ నిబంధనల ప్రకారం హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు సుమారు 2 వేల మంది బదిలీ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంది. తొలి రెండు రోజులు ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని 56 మండలాలకు సంబంధించి 133 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు 11 మంది ఉన్నారు. గురువారం మధ్యాహ్నం వరకు సర్వర్ సక్రమంగా పనిచేయలేదని, ఆ తర్వాత నుంచి సర్వర్ పరవాలేదని ప్రధానోపాధ్యాయులు తెలియజేస్తున్నారు. అయితే, హెచ్‌ఆర్‌ఏ సమస్య రాత్రి పది గంటల సమయంలో పరిష్కారమైనట్టు తెలిసింది. దీంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

ఆన్‌లైన్ వివరాలు అస్తవ్యస్తం...

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నట్టు ఉపాధ్యాయులు వాపోతున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో బయోడేటా అంతా బాగానే ఉన్నా సర్వీస్ పాయింట్లు తప్పుల తడకలుగా చూపిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యాశాఖ



మార్గదర్శకాల ప్రకారం ఉపాధ్యాయుల ఎన్‌టైటిల్ పాయింట్లు గుణించి సీనియారిటీ జాబితా తయారు చేస్తారు. వీరిలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కిందకు వచ్చే వారికి తొలి ప్రాధాన్యతతో బదిలీకి అవకాశం కల్పిస్తారు. అయితే, ఈ పాయింట్లకు సంబంధించి తప్పుల తడకలుగా చూపిస్తున్నట్టు సమాచారం. 15 సర్వీసు పాయింట్లు ఉండాల్సి ఉంటే పది మాత్రమే చూపిస్తోందని, చాలా మందికి ఇదే సమస్య ఎదురవుతోందని తెలిసింది. అలాగే భార్యాభర్తలు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నప్పటికీ స్పౌజ్ పెట్టుకోకపోయినా ఆన్‌లైన్‌లో స్పౌజ్ చూపిస్తోందని, ఆప్షన్ డెలీట్ చేసినా స్పౌజ్ అని చూపిస్తోందని కొంత మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటికితోడు సర్వర్ సమస్య తలెత్తుతూనే ఉంది. ఇక ఎస్జీటీలకు అయితే అసలు సర్వర్ పనిచేయలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులైతే అసలు మిగులు ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు.. ఎక్కవ ఉన్నారని చెప్పకుండా బదిలీల ప్రక్రియ ఏ విధంగా ప్రారంభిస్తారని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.

1:45 అంగీకరించకుండానే...

ఒక్కో సెక్షన్‌కు 1:63 ప్రకారం విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి ఉండాలని ప్రభుత్వం ప్రకటించింది. ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో దాన్ని 1:49కి మార్చింది. దాన్ని కూడా ఉపాధ్యాయ సంఘాలు అంగీకరించడం లేదు. కానీ, సోమ, మంగళవారాలలో విద్యాశాఖ కార్యదర్శి సమక్షంలో నిర్వహించిన చర్చల్లో 1:49నే ఫైనల్ చేశారు. దీని వలన భవిష్యత్తులో ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పవని చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 7 వేల మంది ఉపాధ్యాయులు అధికంగా ఉన్నారని ప్రభుత్వం చెబుతోంది. 1:45 ప్రకారం సెక్షన్లు విభజిస్తే ఈ సమస్య పరిష్కారమవుతుంది. ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించడం తెలిసిందే. ఇప్పటికే 7 వేల మంది ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నారని చెబుతున్న ప్రభుత్వం.. మెగా డీఎస్సీని ఏం చేస్తుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ఒక ప్రహసనంగా కొనసాగుతోంది.

ఎస్జీటీ బదిలీల లాబీయింగ్ షురూ...

ఎస్జీటీల బదిలీల ప్రక్రియలో దరఖాస్తులను ఆన్‌లైన్లో స్వీకరించనున్నారు. మిగతా వెరిఫికేషన్ లాంటివన్నీ ఆఫ్‌లైన్లో చేయనున్నారు. దీంతో ఎస్జీటీల బదిలీల్లో పెద్ద ఎత్తున చేతులు మారే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది.

తొందరపడకండి...

సమస్యలు పరిష్కరించకుండా ఆగమేఘాల మీద బదిలీలు ఎందుకు చేపట్టాల్సి వచ్చిందని ఉపాధ్యాయ సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ముందుగా సమస్యలు పరిష్కరించిన తర్వాతే బదిలీలు చేపట్టాలని పలుమార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకోకుండా మోసం చేసిందని, తొందరపడి దరఖాస్తు చేసుకోవద్దని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూచిస్తున్నారు. మొత్తం మీద బదిలీల ప్రక్రియలో రాబోయే రోజుల్లో ఎటువంటి సమస్యలు తలెత్తుతాయోనని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఇవేమీ పట్టనట్లు తన పని తాను చేసుకునిపోతూ చుక్కలు చూపిస్తోందన్న ఆరోపణలు ఉపాధ్యాయవర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. ఇదిలా, ఉండగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు డీఈఓ కార్యాలయ ఉద్యోగులెవరూ సెలవులు పెట్టవద్దని డీఈఓ కిరణ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

పొగాకు రైతుకు అండగా వైఎస్సార్ సీపీ

- 28న పొదిలి రానున్న పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- గత ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు రైతుకు అండగా నిలిచిన జగన్
- ప్రస్తుతం మద్దతు ధర లభించక కుదేలవుతున్న అన్నదాతలు
- దళారులకు వత్తాసు పలుకుతున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పక్కన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున

ఒంగోలు సిటీ:

పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీ పొదిలి వేలం కేంద్రానికి రానున్నారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఒంగోలు నగరంలో పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకర్లతో వారు మాట్లాడారు. మాయమాటలతో, అబద్ధాలతో రైతులను చిన్నచూపు చూడటం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటేనని కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేస్తే.. వ్యవసాయం దండగ అన్న రీతిలో చంద్రబాబు పాలన ఉంటోందని విమర్శించారు. గతేడాది పొగాకు క్వింటా రూ.36,000కు కొనుగోలు జరిగితే.. నేడు రూ.24,000కు కూడా కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రానున్న రోజుల్లో ధరలు ఇంకా తగ్గే ప్రమాదముందన్నారు. రైతులకు మేలు చేయాలని టుబాకో బోర్డుకు, రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు. టుబాకోను మేము పట్టించుకోమని వ్యవసాయ శాఖామంత్రి అంటుంటే.. అసలు ఈ ప్రభుత్వం ఉన్నట్టా.. లేనట్టా అని కారుమూరి మండిపడ్డారు. రాష్ట్రానికి వెన్నెముక లాంటి రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. దళారీలకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఈ క్రాప్ చేయించి ప్రభుత్వమే బీమా చేయించి రైతులను సకాలంలో ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. పంట నష్టం జరిగితే వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారని చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. మద్దతు ధర లభించక రైతాంగం కుదేలవుతున్నా నేటి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవడం లేదని విమర్శించారు. కందిపప్పు, పెసర పప్పు, మినపప్పు.. ఏదైనా సరే బహిరంగ మార్కెట్లో అధిక ధరలు ఉన్నాయని, రైతుకు మాత్రం గిట్టుబాటు ధర రావడం లేదని అన్నారు. దళారులు రైతు కష్టాన్ని దోచేస్తుంటే కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కారుమూరి మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు డబ్బులిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రగల్భాలు పలికారని, మే 6వ తేదీ కొనుగోలు చేస్తే నేడు 22వ తేదీ అయినా రైతుకు డబ్బులివ్వలేదని ఆరోపించారు. పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మాత్రం అండగా ఉంటోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులను పట్టించుకోడని ఆరోపించారు. రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 28వ తేదీ పొదిలిలో వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

రైతు బంధు.. వైఎస్ జగన్ : ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

గతంలో పొగాకు రైతులు గిట్టుబాటు ధర లభించక అవస్థపడుతుంటే రూ.100 కోట్లు కేటాయించి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి ఆదుకున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గుర్తుచేశారు. నాడు క్వింటా రూ.34,000 నుంచి రూ.35,000 మధ్య కొనుగోలు చేయడంతో పొగాకు రైతులు బాగుపడ్డారని తెలిపారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని జగన్ నమ్మారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుగానీ, కూటమి నాయకులుగానీ రైతులకు భరోసా ఇవ్వడంలేదని మండిపడ్డారు. పొగాకు అమ్మకాలు జరుగుతున్న పలు వేలం కేంద్రాలను పరిశీలించానని, ప్రస్తుతం ఒక క్వింటా రూ.24,000కు కూడా కొనే పరిస్థితి లేదని అన్నారు. లో గ్రేడ్ అయితే కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదన్నారు. వేలం కేంద్రాల వద్ద పొగాకు కొనుగోలు చేయకపోతే దానిని తిరిగి వెనక్కి తీసుకెళ్తున్నారని, ఫలితంగా రైతుపై ఎకరాకు రూ.50 వేలకుపైగా, బ్యారన్‌పై రూ.3.5 లక్షల నుంచి రూ.4 లక్షల వరకూ భారం పడుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో పొగాకు పండించిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, అన్నా కృష్ణచైతన్య, రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, హనుమంతునిపాడు ఎంపీపీ గాయం సావిత్రి, మారెడ్డి సుబ్బారెడ్డి, మీరావలి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం గారూ.. సీహెచ్‌ఓల వైపు చూడండి

- కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల వినూత్న నిరసన

ఒంగోలు టౌన్: అయ్యా సీఎం గారూ.. గత 24 రోజులుగా సమ్మె చేస్తున్నాం.. మా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చేతులెత్తి వేడుకుంటున్నాం.. ఇప్పటి వరకూ మావైపు చూడలేదు.. కనీసం ఒక అధికారిని పంపించి మమ్మల్ని పలకరించలేదు.. మా సమ్మెతో గ్రామాల్లో వైద్యసేవలందక ప్రజలు అవస్థపడుతున్నారు.. గ్రామాలకు 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీలకు వెళ్లలేక బాధపడుతున్నారు.. ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లి ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నారు.. సార్, మావైపు చూడండి... అంటూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద మహిళా సీహెచ్‌ఓలు చున్నీలతో అయ్యా సీఎం సార్.. మా సీహెచ్‌ఓల వైపు చూడండంటూ రోడ్డుపై రాసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓలు మాట్లాడుతూ సమ్మె చేస్తున్న సీహెచ్‌ఓలను ఇప్పటి వరకు ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రజలకు ఆరోగ్య సేవలు అందజేయడమే కాకుండా గ్రామీణ తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న సీహెచ్‌ఓలు సమ్మె చేపడితే ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని వాపోయారు. ఇప్పటికైనా సీహెచ్‌ఓల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా నాయకులు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

ఇళ్లకు డోర్ నంబర్లు వేయిస్తాం

- ఓటుకు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలి
- జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో ఇళ్లకు డోర్ నంబర్లు వేయిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నెలవారీగా పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే మీటింగ్‌లో భాగంగా స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గురువారం పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో డీఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతినెలా జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవడం తప్పనిసరని ఎన్నికల సంఘం సూచించిందని తెలిపారు. ఆధార్ అనుసంధానం చేసుకోని వారు ఓటు హక్కును కోల్పోతారన్నారు. జిల్లాలోని పోలింగ్ స్టేషన్లు సరిగ్గా ఉన్నదీ, లేనిదీ గుర్తిస్తున్నట్లు తెలిపారు. పొలిటికల్ పార్టీల సభ్యులు సమావేశంలో అడిగిన ప్రశ్నలకు డీఆర్వో సమాధానం చెప్పారు. చనిపోయిన వారి ఓట్లు తెలపాలని, వారి ఓట్లు తొలగించటానికి ప్రజలు సహకరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ మాట్లాడుతూ ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామాల్లో డోర్ నంబర్లు లేకపోవడం వలన కొత్తగా ఓట్లు చేర్చుకోవడం కష్టతరమవుతోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డోర్ నంబర్లు లేకపోవడంతో ఓటర్లు ఇబ్బందిపడుతున్నారని, వెంటనే డోర్ నంబర్లు వేయించాలని కోరారు. డీఆర్‌ఓ సమాధానమిస్తూ కమిషనర్లకు చెప్పి డోర్ నంబర్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న డీఆర్‌ఓ చినఓబులేసు

క్లుప్తంగా

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శ్యామల


పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల

బేస్తవారిపేట: హనుమాన్ జయంతి సందర్భంగా బేస్తవారిపేట మండలంలోని సలకలవీడు గ్రామంలో అభయ వీరాంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి ఆరె శ్యామల గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష పూజలు, సువర్చ సహిత ఆంజనేయస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. తొలుత ఆమెకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త బిక్కా రామాంజనేయరెడ్డి, గ్రామస్తులు ఘన స్వాగతం పలికి సన్మానించారు.

కుక్కల దాడిలో జింక మృతి


జమ్ములపాలెం శివారులో మృతి చెందిన జింక

టంగుటూరు: అటవీ ప్రాంతం నుంచి జనావాసాల్లోకి వచ్చిన జింకను కుక్కలు వేటాడి చంపేశాయి. ఈ సంఘటన టంగుటూరు మండలంలోని జమ్ములపాలెం గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామ శివారులో జింకను నాలుగు కుక్కలు దాడి చేస్తున్న సమయంలో స్థానికులు గమనించి తరమికొట్టారు. అప్పటికే జింక మృతి చెందింది. దీంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

రైల్వే స్టేషన్లో గంజాయి విక్రేత అరెస్టు

- 1.7 కేజీల గంజాయి స్వాధీనం


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

ఒంగోలు టౌన్: రైల్వే స్టేషన్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న కేరళకు చెందిన వ్యక్తి నుంచి రైల్వే పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు రైల్వే స్టేషన్ మూడో నంబర్ ప్లాట్‌ఫారంపై గురువారం సాయంత్రం ఓ వ్యక్తి చేతిలో గ్రే కలర్ సంచితో అనుమానాస్పదంగా తిరగడాన్ని పోలీసులు గమనించారు. అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 1.7 కిలోల గంజాయి లభ్యమైంది. పోలీసుల దర్యాప్తులో సదరు వ్యక్తి కేరళకు చెందిన ఎస్ఆర్ విజయ్‌గా తేలింది. గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. తనిఖీలో జీఆర్పీ ఎస్సై మధుసూదనరావు, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.


కొత్త వలలు కట్టుకుంటున్న మత్స్యకారులు


ఇంజన్లు రిపేర్లు చేస్తున్న మెకానిక్

చేపను బట్టి వల!



ఆదివారమొస్తే మాంసప్రియులు ఏ చేప తినాలో నిర్ణయించుకుని జిహ్వా చాపల్యాన్ని చల్లార్చుకోవడం సహజం. ఆ చేపల వెనుక గంగపుత్రుల కష్టం దాగి ఉంది. ఎగసిపడే అలలకు ఎదురెళ్లి చేపలు పట్టడమంటే మార్కెట్‌లో డబ్బిచ్చి కొనుగోలు చేసినంత సులువు కాదు.! చేపల రకాన్ని బట్టి వలలు వినియోగించి, రేయింబవళ్లు శ్రమించి వేట సాగిస్తారు మత్స్యకారులు. సముద్రంలో వాతావరణాన్ని బట్టి ఎటువంటి చేపలు పడతాయో అంచనా వేసి ఆ వలలే ఉపయోగిస్తారు. ఈ క్రమంలో మత్స్య సంపద చిక్కక ఒడ్డుకొచ్చిన సందర్భాలూ ఉన్నాయి. ప్రస్తుతం వేట విరామ సమయం కావడంతో కొత్తపట్నం తీరంలోని మత్స్యకారులు 16 రకాల వలలు సిద్ధం చేసుకుంటున్నారు. అయిల్ ఇంజన్లకు మరమ్మతులు చేయించుకోవడంతోపాటు బోట్లనూ రెడీ చేస్తున్నారు.

- వేట విరామ సమయంలో బిజీబిజీగా మత్స్యకారులు
- ఒక్కో బోటుకు 16 రకాల వలలు సిద్ధం చేసే పనిలో నిమగ్నం
- ఇంజన్లకు మరమ్మతులు, బోట్లకు తుది మెరుగులు
- జూన్ 15 నుంచి మొదలుకానున్న బతుకు వేట



కొత్తపట్నం:

విరామం వేటకే కానీ తమకు కాదంటున్నారు మత్స్యకారులు. పూట గడవడానికి కొందరు పనులకు వెళ్తుండగా మరికొందరు వలలు, బోట్లు, ఇంజన్లు సిద్ధం చేసుకునే పనిలో బిజీబిజీగా గడిపేస్తున్నారు. ఏడాది పొడవునా వేట సాగించేందుకు వీలుగా అవసరమైన సామగ్రిని జాగ్రత్తగా సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం వేట విరామం తేదీ ప్రకటించగానే బోట్లను ఒడ్డుకు చేర్చిన మత్స్యకారులు.. కొద్ది రోజులకే కొత్త వలలు కొనుగోలు చేశారు. వాటిని క్రమ పద్ధతిలో అల్లుకుంటున్నారు. సముద్రంలో లభించే దాదాపు 52 రకాల చేపలు వేటాడేందుకు మత్స్యకారులు 16 రకాల వలలను వినియోగిస్తారు. వేట విరామం గడువు ముగిసిన తర్వాత సాగర గర్భంలో మత్స్య సంపద విరివిగా లభించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో వేటకు వీలుగా అన్ని రకాల వలలను సమకూర్చుకుంటున్నారు. ఒక్కో బోటుకు 16 రకాల వలలు తయారు చేసుకుంటున్నట్లు జిల్లాలోని తీరప్రాంత మత్స్యకారులు చెబుతున్నారు. వంజరం వలలు, చందువా, బంక సీదలు, సీదలు, గుల్ల రొయ్యల వలలు, గేరకాళ్లు, పెద్ద రొయ్యల వలలు, అడస రొయ్యల వల, పూసల వల, జాయింట్ వల.. ఇలా వివిధ రకాల వలలను రూ.లక్ష నుంచి రూ. 2.5 లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. పెద్ద కూనాం చేపలను వేటాడేందుకు వినియోగించే రింగు వలలు రకం, పరిమాణాన్ని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షలకు పైగా, బోటు రూ.3.5 లక్షల వరకు ఉంటుంది. మూడు ఇంజన్లు వినియోగించే ఈ బోట్లు, రింగు వలలు భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో మత్స్యకారులు బృందంగా ఏర్పడి వేట సాగిస్తున్నారు.

సబ్సిడీ పెంపుపై గంపెడాశలు

వలలు, బోట్లు, ఇంజన్లు తదితర వేట సామగ్రిని 70 శాతం సబ్సిడీపై ఇస్తే ఆర్థికంగా ఎదిగేందుకు ప్రయోజనకరంగా ఉంటుందని మత్స్యకారులు ఆశిస్తున్నారు. గతంతోపాటు ప్రస్తుతం ఇస్తున్న 40 శాతం సబ్సిడీని 70 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇచ్చే 40 శాతం సబ్సిడీలో అన్ని ఖర్చులు పోగా వర్తించేది 30 శాతమేనని, మొత్తం సబ్సిడీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తే ఎప్పటి నుంచో నిల్వ ఉన్న వేట సామగ్రి అంటగడుతున్నారని మత్స్యకారులు వాపోతున్నారు. వేట విరామ సమయంలోనే వలలు, బోట్లు, ఇంజన్లు సబ్సిడీపై ఇస్తే మళ్లీ వేట మొదలయ్యేనాటికి సిద్ధం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

సబ్సిడీపై లోన్లు ఇవ్వాలి



విరామ సమయంలో 70 శాతం సబ్సిడీపై లోన్లు ఇస్తే వలలు, బోట్లు తయారు చేసుకుంటాం. ఇప్పటికే విరామ సమయంలో నెల రోజులకు పైగా గడిచిపోయాయి. ప్రస్తుతం పాత వలలను రిపేర్ చేసుకుంటున్నాం. మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నాం.

– రాసాని మీరాసాహెబ్, కొత్తపట్నం పల్లెపాలెం

లైంగికదాడి కేసులో నిందితుడు అరెస్టు

ముండ్లమూరు(కురిచేడు): పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ముండ్లమూరు ఎస్సై కమలాకర్ తెలిపారు. మండలంలోని రమణారెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఇస్తాల మణికంఠ అనే యువకుడు ఇటీవల ఓ యువతిని వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం ఉల్లగల్లు గ్రామంలోని వేముల బస్టాండ్ వద్ద మణికంఠను అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో బీహార్ వాసి మృతి

పొదిలి రూరల్: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన పొదిలి నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారిపాలెంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాటూరి నారాయణరావు పశువుల ఫారంలో బీహార్‌కు చెందిన నితీష్‌కుమార్(45) పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే పని చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఎల్‌డీఓ


డీఎల్‌డీఓ బాలునాయక్

మార్కాపురం: మార్కాపురం డీఎల్‌డీఓగా పి.బాలునాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా మాచర్లలో డీఆర్‌డీఏ క్లస్టర్ ఏపీడీగా విధులు నిర్వహిస్తున్న ఆయనను మార్కాపురం డీఎల్‌డీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది నూతన డీఎల్‌డీఓకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారిస్తానని చెప్పారు.

విద్యుదాఘాతంతో 22 గేదెలు మృతి



చింతగుంట్ల-తిప్పాయిపాలెం మధ్య రామిరెడ్డి నగర్ సమీపంలో మృతి చెందిన గేదెలు

- పాడి రైతులకు రూ.17 లక్షల నష్టం

మార్కాపురం: పొలాల్లో మేతకు వెళ్లిన 20 గేదెలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన గురువారం మార్కాపురం మండలం చింతగుంట్ల-తిప్పాయిపాలెం గ్రామాల మధ్య ఉన్న రామిరెడ్డి నగర్ సమీపంలో చోటుచేసుకుంది. చింతగుంట్ల, అయ్యవారిపల్లి, బడేఖాన్ పేట, తిప్పాయిపాలెం గ్రామాలకు చెందిన పాడి రైతులు తమ గేదెలను గురువారం ఉదయం మేత కోసం సమీప పొలాల్లోకి తోలారు. చీకటి పడినా గేదెలు ఇంటికి రాకపోవడంతో వెదుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో రామిరెడ్డినగర్ వాసులు ఒకే చోట 20 గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. మందటి చిన్న ఆనందరెడ్డికి చెందిన 2 గేదెలు, మందటి వెంకటరెడ్డి 2 గేదెలు, దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి 2, తేలుకుట్ల చిన్న వెంకటరెడ్డి 3, సింగపోగు గురవమ్మ 8, ఎం.రంగారెడ్డికి చెందిన ఒక గేదెతోపాటు ఇంకా పలువురు రైతులకు చెందిన పాడి గేదెలు ఉన్నాయి. ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న పాడి రైతులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.15 లక్షలు ఉండొచ్చని అంచనా.

హెటీ లైన్ తెగి పడటమే కారణం

బుధవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి హెటీ లైన్ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. మేతకు వెళ్లిన గేదెలకు ఆ తీగలు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలుస్తోంది. గేదెల మృతిపై విద్యుత్ శాఖ ఏఈ నాగేందర్ రెడ్డిని వివరణ కోరగా విద్యుత్ షాక్‌కు గురైతే ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతుందని, కానీ అలా జరగలేదన్నారు. పిడుగుపాటుకు గురై మృతి చెంది ఉండొచ్చని చెప్పారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

రావిపాడులో రెండు గేదెలు మృతి

కంభం: విద్యుదాఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందిన సంఘటన కంభం మండలంలోని రావిపాడు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామ రైతు నారాయణరెడ్డికి చెందిన రెండు గేదెలు స్థానిక బీసీ కాలనీలోని విద్యుత్ స్తంభం వద్ద షాక్‌కు గురై మృతి చెందాయి. సుమారు 1.80 లక్షల విలువ చేసే గేదెలు మృతి చెందడంతో రైతు బోరుమని విలపించాడు. నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.


రావిపాడులో మృతి చెందిన గేదెలు

సాగర్ పైప్‌లైన్ పనులు ప్రారంభం


సాగర్ పైప్‌లైన్ పనులు చేస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణానికి సాగర్ నీరు అందించే పైప్‌లైన్లకు మరమ్మతులు ప్రారంభించారు. మార్కాపురం పట్టణ ప్రజల తాగునీటి కష్టాలపై ఈనెల 18న 'పురం గొంతులో నీటి ముల్లు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. త్రిపురాంతకం మండలం దూపాడు వద్ద మార్కాపురం ఎస్ఎస్ ట్యాంకు ఉంది. అక్కడి నుంచి మార్కాపురం వరకు 26 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులకు నింపి నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఈ పైప్‌లైన్‌కు అక్కడక్కడా లీకేజీలు ఏర్పడడంతో నీటి సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. సక్రమంగా మరమ్మతులు చేయకపోవడంతో పట్టణ ప్రజలకు 6 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల నీటి కష్టాలపై 'సాక్షి'లో కథనం రావడంతో అధికారులు స్పందించి మరమ్మతుల పనులు ప్రారంభించారు.

యోగా మాసోత్సవాలు విజయవంతం చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- యోగాంధ్ర-2025పై జిల్లా అధికారులతో సమీక్ష


యోగాంధ్రపై సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన జేసీ, ఏఎస్పీ

ఒంగోలు సబర్బన్: యోగా మాసోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ×యోగాంధ్ర-2025₹ మాసోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతోపాటు ముందస్తు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏ రోజు ఏ కార్యక్రమం నిర్వహించాలి, అందుకు చేపట్టవలసిన చర్యలపై గ్రామ, మండల, జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికలు రుపొందించాలని సూచించారు. నెల రోజులపాటు సాగే ఈ కార్యక్రమంలో ఒక్కో రోజు ఒక్కో జిల్లాలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఉంటుందన్నారు. అందులో భాగంగా జూన్ 18వ తేదీన 5 వేల మంది స్వయం సహాయక సభ్యులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాలో ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేకంగా యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మే 26వ తేదీ, జూన్ 2, 8, 15వ తేదీల్లో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో కనీసం వేయి మందితో యోగా సాధన చేయించాలని చెప్పారు. యోగాపై గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించాలని సూచించారు. రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకు జిల్లాలోని గ్రామాలు, నగర పాలక సంస్థ, మున్సిపాలిటీల్లో ప్రజలతో రోడ్లపై యోగా సాధన చేయించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో 100 మంది మాస్టర్ ట్రైనర్లు, మండల స్థాయిలో 200 మంది ట్రైనర్లను గుర్తించి జాబితా రుపొందించాలని ఆయుష్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. యోగా శిక్షణ కోసం జిల్లాలోని ప్రజలందరూ రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేకించి మండల స్థాయిలో మహిళా స్వయం సహాయక సంఘాలు, ఉపాధి హామీ కూలీలు, పట్టణ ప్రాంతాల్లో మెప్మా ఎస్‌హెచ్‌జీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు ఇలా అందరినీ సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజలంతా ఈ నెల రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, అంతర్జాతీయ యోగా వేడుకలను వివిధ సంస్థలు, మీడియా సహకారంతో విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, ఆయుష్ శాఖ ఆర్‌డీడీ పద్మజాతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, యోగా సాధకులు పాల్గొన్నారు.

రోడ్డున పడిన సచివాలయ ధ్రువీకరణ పత్రాలు!



కొమరోలు: గ్రామ సచివాలయంలో ఉండాల్సిన సచివాలయ ఖాళీ ధ్రువీకరణ పత్రాలు రోడ్డునపడ్డాయి. కొమరోలు మండలంలోని పురుషోత్తమునిపల్లె గ్రామ రహదారికి ఇరువైపులా కిలోమీటరు మేర ధ్రువీకరణ పత్రాలు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. ఓ పొలంలో వందలకొద్ది ఖాళీ బాండ్ పేపర్లు పడి ఉండటాన్ని అటువైపుగా వెళ్తున్న ప్రజలు చూసి విస్తుపోయారు. ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ, జనన, మరణ తదితర ధ్రువీకరణ పత్రాలను గ్రామ సచివాలయంలో ఈ బాండ్ పేపర్ మీదనే ప్రింట్ తీసి ఇస్తారు. ఈ మార్గానికి సమీపంలో సచివాలయం లేకపోవడంతో ఇవి ఎక్కడి నుంచి వచ్చాయి, ఏ గ్రామ సచివాలయానికి చెందినవని స్థానికులు చర్చించుకుంటున్నారు.


రహదారి పక్కన పడి ఉన్న సచివాలయ ఖాళీ బాండ్ పేపర్లు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

- 5సం॥ల పెరిగిన శ్రీగంధ ఎర్రచందనం వనం లో 12 1/2 గదులు లక్ష అరవై వేలకే మా వనం చూసిన తరువాత నిర్ణయం తీసుకోండి. 9908822077 [SCA25004016]

Wanted

- నర్సరీ టు 3rd క్లాస్ E.M లో బోధించుటకు టీచర్స్, ఆయాలు కావలెను. శ్రీ కృష్ణ సాయి హై స్కూల్ పేర్నమిట్ట సెల్ : 9440209452. [SCA 25004041]
- ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్ మేనేజర్స్, ఫీల్డ్ మేనేజర్స్, ఆఫీస్ ఇంచార్జి, టెలికాలర్స్, ఆఫీస్ మేనేజర్ కావలెను. జీతం 20 వేలు. సం.ప్ర. 99084 29239 [SCA 25004005]
- కావలి రామాయపట్నం సమీపంలోకి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 15000 Quel 10th P/F Age 20 to 48, ఫ్రీ రూమ్ సబ్సిడి మీల్స్ కలదు. 9959444086. [NA-24188]
- **American Public school,** Boddikura padu, Prakasam District. AP. Wanted Teachers for Nursery, LKG, UKG, English, Social, Telugu, Physics, Computer Contact : 9908556781. [SCA25004043]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి : క్లాసిఫైడ్స్ : ఒంగోలు 90102 02762